
12
9
CHANDRA
భయం

# భయం

స్త్రీపాత్రలేని నాటిక

వై.రాంబాబు & శాయి

<u>మనవి:</u>

నాటిక ప్రారంభంలో కాంతారావు సంభాషణలు అతనే చెప్పవచ్చును. ప్రయోక్త అయినా తెర వెనుక నుంచి పలుకవచ్చు. లేదా టేప్ రికార్డర్ నుంచి ఎవరిదో ఉపన్యాసం లాగా వినిపించవచ్చును. అలాంటప్పుడు మధ్య మధ్యలో కొంత విరామం యివ్వడం ఉచితం. ఇందుకోసం వంటవాడు కందస్వామి పాత్రను రంగస్థలం మీద ప్రవేశపెట్టుకోవచ్చును. రెండో భాగం ప్రారంభంలో రాజా పాడే భక్తి గీతాన్ని ఆ వేషం ధరించే బాలుని సామర్థ్యాన్ని బట్టి ప్రదర్శకులే ఎంచుకోవాలి.

కాంతారావు యింటి సెట్ మధ్యతరగతి కుటుంబీకునిదిగా వుండాలి.

బాలరాజా ఇల్లు ఖరీదైనదిగా వుండటం అవసరం.

నాటిక ప్రదర్శకులు వారి వారి అభిరుచిని బట్టీ, వారి కుండే వనరులను దృష్టిలో ఉంచుకునీ తగిన స్థాయిలో ఈ నాటికను ప్రదర్శించుకోవచ్చును. ఇంకా ఏమైనా సూచనలు, సలహాలు కావలసిన వారు మమ్మల్ని సంప్రదించవచ్చు!

ఆంధ్ర సచిత్ర వార పత్రిక (24-12-65)లో మేం రాసిన "భయం" కథ ఈ నాటికకు మూలాధారం.

ఈ నాటికను ప్రదర్శించగోరు వారు మా వ్రాత పూర్వక మైన అనుమతిని పొందడం అవసరం.

అభినందనలతో....

వై.రాంబాబు & శాయి.

* <u>పాత్రలు</u> *

బాలరాజా – 32 ఏళ్ళ వయస్సున్న పెరికవాడు
కాంతారావు – జ్యోతిష్కుడు – మధ్యవయస్కుడు
గోపయ్య – బాలరాజా ఇంట్లో నౌకరు – 50 సం॥
రాజా – బాలరాజ కొడుకు – వయసు 10 సం॥

(కాంతారావింట్లో ముందు గది. కాంతారావు గదిలో అటూ ఇటూ తిరుగుతూ ఆకస్మాత్తుగా ఆగిపోయాడు)

జీవితం నీటి బుడగని అందరికీ తెలుసు.
ఈ జీవితం నీటి బుడగని అందరికీ తెలుసు.
అయినా వ్యామోహం తప్పదు!

ఇంకా ఇంకా బతకాలనీ జీవితం నించి ఎంతో ఆనందాన్ని పిండుకోవాలనీ ప్రతి మనిషీ తపిస్తాడు. ఆరాట పడతాడు. బుద్బుద ప్రాయమైన ఈ గాజు పాత్రకు ఏ మాత్రం చిన్న దెబ్బ తగిలినా ఆందోళన చెందుతాడు. ఏమై పోతుందోనని కలవరిస్తాడు. సర్వమూ తెలిసి కూడా సర్వజ్ఞుడైన మానవుడు ఇలా ఎందుకు వాపోతాడో ఈషణ్మాత్రమూ అర్థం కాదు. తాగుడువల్ల ఆరోగ్యం చెడిపోతుందని తెలిసి కూడా పీకల మొయ్యా తాగేవాళ్ళను నేనెరుగుదును.

కాన్సర్ రోగానికి గురైన మనిషి తిరిగి సంపూర్ణారోగ్యాన్ని పొంది జీవితం నించి సుఖాన్ని పొందాలని తహ తహలాడడం నేనెరుగుదును. ఇంతెందుకు – ఏదో కోపంతో నిండు జీవితాన్ని అంత మొందించు కోవాలని ఎండ్రిన్ త్రాగే యువకుడు చచ్చిపోయే తరుణం ఆసన్నమైన వెనుక బతకాలనీ, చావును తప్పించుకోవాలనీ డాక్టరు కాళ్ళా వేళ్ళా పడి జాలి చూపులతో ప్రాణ భిక్ష పెట్టమని అర్థించడం నేనెరుగుదును. ఇదొక చిత్రమైన నాటకం. చావంటే ప్రతి మనిషికీ భయం. పుట్టిన ప్రతి మనిషీ చావక తప్పదు. ప్రాణమున్న ప్రతి జీవి గుండె గడియారమూ ఏదో ఒక రోజు ఆగిపోక తప్పదు అయినప్పుడు, చావు గురించి భయపడడం ఉత్తమ పురుషునికుండవలసిన లక్షణం కాదు.

బా : (వచ్చి వింటున్నాడు)

కాం: (చటుక్కున వెనక్కు తిరిగి చూశాడు)

బా: నమస్కారమండీ!

కాం: నమస్కారం

బా: నేను కాంతారావు గారి కోసం వచ్చాను

కాం: ఊళ్ళో లేరు.

బా : ఊళ్ళో లేరా?

కాం: కాకినాడ వెళ్ళేరు

బా : అలాగా– ఎప్పుడొస్తారో చెబుతారాండీ?

కాం : తెలీదు

బా : నేను లోపలికి రావచ్చా?

కాం : సారీ! రండి రండి –

బా : మీరెవరో నాకు తెలీదు

కాం : నేను – నా పేరు శేఖరం – సోమ శేఖరం.....

బా : చూడండి సోమశేఖరం గారూ! నేనిలా కూచో వచ్చునాండీ?

కాం : అరె.... మిమ్మల్ని లోపలికి రమ్మన లేదు. కూచోమనలేదు.

బా : ఫరవాలేదు లెండి నేను మీ మర్యాదల కోసం రాలేదు. కాంతారావు గారిని కలుసు కోవడానికి వచ్చాను. ఆయన కాకినాడ వెళ్ళేరని చెప్పగానే కొంచెం నిరుత్సాహ పడ్డాను.

కాం : మీ రెవరో చెప్పలేదు.

బా : చెప్పి మాత్రం ప్రయోజనం ఏంవుందండీ? కాంతారావు గారితో నాకు పూర్వ పరిచయం లేదు. నాపేరు బాలరాజు

కాం : మీ కేదైనా జాతకం రాయాలా?

బా : జాతకం – చూడండి! ఈ జాతకాలు రాసేవాళ్ళు, జాతక ఫలితాలు చెప్పే వాళ్ళు చాలా ప్రమాదకరమైన వ్యక్తులు.

కాం : నా కర్థం కాలేదు.

బా : చేయి కాలితేగానీ నిప్పేం చేస్తుందో తెలీదు.

# 'భయం" నాటిక గురించి నాలుగు వాక్యాలు

ఇరవై అయిదు సంవత్సరాల క్రితం కథగా వెలుగు లోకి వచ్చిన "భయం"ని నాటికగా మలిచారు శ్రీ యుతులు వె.రాంబాబు, శాయిగారలు. రంగరచనా ప్రవీణులు, ఔత్సాహిక నాటక సమాజాల పుట్టుకకే మనుగడకే కొత్త ఊపిర్లు పోసిన గురుతుల్యులు కీ.శే.డాక్టర్ కొర్రపాటి గంగాధరరావుగారి సన్నిహితుడు గా శాయిగారు నాకు చిరపరిచితులు.

"భయం"నాటిక('భయం' కథ కాదు) చదవగానే నాకు ఓ.హెన్రీ కథ *THE LAST LEAF* చటుక్కున గుర్తు కొచ్చింది. అంతకు మినహ యించి ఆ కథకూ యీ నాటికకూ మధ్య ఏ పోలికా వున్నదని నేను అనలేను.

"చావుకన్న భయం భయంకరమైనది" అన్న భయంకరమైన నిజానికి యిది అక్షరరూపకల్పన. 'ఎన్నిసార్లు గీస్తే ఓ చిత్రం! ఎన్ని సార్లు చెక్కితే ఓ శిల్పం! కబుర్లు చెప్పకే ఓ కాలమా! ఎన్ని సార్లు చస్తే ఓ జీవితం" అని ఆత్రేయ గారి గురించి నారాయణరెడ్డి గారి రుబాయీ మరోసారి జ్ఞాపకాని కొచ్చింది.

ఫలానా రోజున యిన్ని గంటలకు నీవు మరణిస్తావు అని ఓ జ్యోతిష్యుడు నిర్దేశిస్తే ఆ ప్రకారం ఓ "సరోజ" కన్ను మూసింది. కాని బాలరాజు విషయంలో అలా జరగలేదు. ఏదైనా జరగడం జరగకపోవడం ఒక మనిషి నమ్మకం మీద ఆధారపడి వుంటుందనే వాదాన్ని ధృవీకరించారు రచయితలు యీ నాటిక ద్వారా. "జ్యోతిష్యం గతం గురించి చెప్పినంత ఖచ్చితంగా భవిష్యత్తును చెప్పలేదు. ప్రెడిక్షన్ అనేది నూటికి నూరుపాళ్ళు నిజం కాదు" అని నొక్కి వక్కాణిస్తుంది కాంతారావు పాత్ర. బాలరాజుకి కొత్త ఊపిర్లు పోస్తుంది. "మీరు వర్తమానంలోని నిరాశను భవిష్యత్తుకు అంటగట్టకండి. ఈ నిరాశను యింత తోనే తుడిచేసెయ్యండి" అని మనిషిలో ఆశావాదాన్ని రేకెత్తిస్తుంది. "రేపు మీది బాలరాజుగారూ! రేపటి మీది ఆశతో మీ నిరాశను సమూలంగా నరికిపారేయండి. మీ కోసం సూర్యుడు అందంగా ఉదయిస్తాడు. వెన్నెల మీ కోసం కాస్తుంది. కోకిల మీ కోసం పాడుతుంది. సకల చరాచర జగత్తూ మీ కోసమే స్పందిస్తుంది" అనే *poetic expression* ద్వారా కవితానాటకాన్ని గుర్తుకు తెస్తారు యీ రచయితలు. ఇలాంటి సంభాషణం చేసిన కాంతారావు పాత్రలోకే భయం ఆవహించేసరికి "బతికి సాధించగలిగేదేముంది. నేటి వర్తమాన స్థితి గతులను బట్టి చచ్చిపోవడమే మంచిదేమో" అనే నిరాశావాదం పెనవేసుకు పోతుంది. *What a dramatic irony.*

నేటి ఔత్సాహిక నాటక సమాజాల సౌలభ్యం కోసం "భయం" కథను నాటికగా మలచిన తీరును అభినందించకుండా వుండలేక పోతున్నాను. నాటక రచనా శిల్పాన్ని రచయిత విస్మరిస్తున్న యీ అధ్వాన్న యుగంలో యింత బుర్రకి పదును పెట్టగల రంగస్థల ప్రయోగాలు వెలుగులోకి రావలసిన అవసరం ఎంతైనా వుంది. నాటికగా మలచబడి పదమూడేళ్ళయినా యింత వరకూ దీన్ని ప్రచురించకుండా జాప్యం చేసినందున ఎన్నో మంచి ఔత్సాహిక సమాజాలు యీ నాటికను ప్రదర్శించే అవకాశాన్ని కోల్పోయాయి. ఈ జాప్యానికి రచయితలే కారకులైతే వారిని తప్పు పట్టకుండా వుండలేను.

పదేళ్ళ వయస్సున్న బాలరాజు కొడుకు రాజా "అమ్మా, నాన్నా అన్నీ మీరే నాకు. నేను కళ్ళ చూడని అమ్మను గురించి ఏడవడం కన్న మీలో అమ్మను చూసుకుని గర్విస్తున్నాన్నేను" అన్న సంభాషణ పాత్రవయస్సును బట్టి, మేధను బట్టి సమంజసంగా వుందా ? అన్న సందేహం కలుగకమానదు. ఈ సందేహం సహేతుకమైనదే అయితే యీ సంభాషణలో సవరణ అనివార్యమవుతుంది.

*To sum up it is a thought provoking play* అని నా అభిప్రాయం. ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చ గలిగే అవకాశం కల్పించిన రచయితలకు నా కృతజ్ఞతలతో

సెలవ్

చాట్ల శ్రీరాములు.
ఉస్మానియా విశ్వవిద్యాలయం
నాటక విభాగం
హైద్రాబాద్.

---

కాం : మీరు ఆపని మీదే వచ్చారా?

బా : నాకు చేయి కాలు లేదు. గుండె కాలిపోయింది.

కాం : మరింక కాంతారావుతో పనేమిటి?

బా : సరే! వెళ్ళొస్తాను.

కాం : మీరు కాంతారావు కోసం ఎందుకు వచ్చారో చెప్పలేదు.

బా : ఆయన మీకే మౌతాడు ?

కాం : స్నేహితుడు –

బా : ఆయనకో సలహా చెప్పగలరా?

కాం : చెప్పండి.

బా : వద్దు లెండి – మీరేదో చావు గురించీ, భయం గురించీ ఉపన్యాసం యిస్తున్నారు. మిమ్మల్ని అనవసరంగా డిస్టర్బ్ చేశాను.

కాం : అసలు మీరు కాంతారావు గురించి ఎందుకు వచ్చారో చెబితే మంచిది.

బా : మీతో చెప్పి లాభం లేదండీ!

కాం : ఒక్క నిముషం కూచోండి

బా : ప్రతి నిముషం విలువైంది నాకు. కాలయాపన చేస్తూ కూచోడానికి ఎన్నో రోజులు లేవు.

కాం : అంటే –

బా : అందరిలా జీవితం నాకు నూరేళ్ళ పొడుగు లేదు.

కాం : అని మీరు ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు?

బా : నిజమే! అది ఖచ్చితంగా సత్యం అని నేను ఎందుకంటున్నానో నాకే తెలీదు.

కాం : మీ date of birth చెప్పండి.

బా : మీకు ఇందులో ప్రవేశం వున్నట్టుంది –

కాం : అవునవును – స్నేహదోషం.

బా : మనుష్యులు అకస్మాత్తుగా ఎందుకు చచ్చిపోతుంటారో చెప్పగలరా?
కాం : గ్రహ గతులు వక్రిస్తే మనిషి గుండె ఆగిపోక ఏం చేస్తుంది?
బా : మనిషి గుండెకూ, గ్రహగతికీ ఏమిటండీ సంబంధం?
కాం : మనిషి ప్రతి కదలికకూ నవగ్రహ సంచారానికి విడదీయరాని సంబంధం ఉంది.
బా : మీరు చెప్పే దేమిటో నాకు బాగా తెలుసు. మీ లెక్క ప్రకారం మనిషి నవగ్రహాలకు బానిస. గ్రహాలకు ఏ ప్రాణమైనా కీలుబొమ్మ. కలిమీ, బలిమీ, ఆయువూ, ఆర్జనా-- అన్నీ కూడా గ్రహసంచారం మీదే ఆధారపడి ఉన్నాయి. అంతేగా మీరనేది.
కాం : ఇంతసేపూ మీతో చాలా అనవసరంగా మాట్లాడేను
బా : కోపం తెచ్చుకోకండి నిజానికి కోపం రావలసింది నాకు.
కాం : నా మీద మీకు కోపమా?
బా : కాకపోతే ఏమిటండీ? ఎందుకబద్ధం ఆడేరు?
కాం : ఏమిటండీ అబద్ధం?
బా : (నవ్వేడు) మీరేం అబద్ధం ఆడేరో నాకు తెలుసు. నాకు తెలుసునని మాత్రం మీకు తెలీదు.
కాం : బాలరాజుగారూ! మీ రు వెళ్ళవచ్చు
బా : (మళ్ళీ నవ్వేడు) ఇంతకోపమైతే ఎలా కాంతారావుగారూ?
కాం : బాలరాజుగారూ!
బా : సోమశేఖరాన్నని అబద్ధం ఆడేరు. నేను ఎంత శ్రమపడి మీ దగ్గరకు వచ్చానో తెలుసా? ఎంత ఆశతో వచ్చానో తెలుసా? తుఫాను గాలికి గడగడ లాడిపోయే రెమ్మలాగ వచ్చాను. కాస్త ధైర్యపు తేనీరు అందిస్తారన్న ఆశతో వచ్చాను. కాంతారావుగారూ! కాసిని మంచి నీళ్ళివ్వండి!
కాం : సారీ మిస్టర్ బాలరాజ్! అలా కూచోండి - కాస్త కాఫీ తాగితే కానీ, మీరు తేరుకొనేలా లేరు.
బా : అవును - కాఫీ కావాలి - ఈ కాఫీ యింకా ఎన్నాళ్ళు తాగగలను?
కాం : కందసామీ! ఒరు కాఫీ కుడప్పా!
అయామ్ వెరీ వెరీ సారీ మిస్టర్ బాలరాజ్! నిజజీవితంలో యిలా చమక్కులు చేయడం నాకు బాగా అలవాటు.
బా : చమక్కులు - రెండు బ్రతుకు నాకూ వుంటే, నేనూ ఎన్నో చమక్కులు చేయాలనుకున్నాను
కాం : ఇప్పుడేం వచ్చిందని మీకు?
బా : మీరు వినండి - మధ్యలో ఏ ప్రశ్నా వేయకండి. కాంతారావుగారూ! నేను మీకు ఎన్నో చెప్పాలని వచ్చాను. మీ చమక్కులతో నన్ను తల్లకిందులు చేశారు. మీరు వెళ్ళి స్వయంగా తీసుక రండి. కాఫీ తాగిగానీ నేనేం చెప్పలేను.
కాం : (వెళ్ళేడు)
బా : (నిరాశగా వెనక్కి వాలేడు. కాఫీ వచ్చింది అందుకున్నాడు)
బా : ఇందులో కెఫీన్ అనే విషం ఉందిట. అది విషమా? కాదు. కెఫీన్ విషం కాదు. అది విటమిన్. నిరుత్సాహాన్ని పారద్రోలే విటమిన్. నేను కాఫీ తాగి -
కాం : ముందు కాఫీ తాగండి.
బా : యస్ - మరి - మీరు?
కాం : నేనింతకు ముందే తీసుకున్నాను.
బా : ఫెక్టీ -- ఫెక్టీ
కాం : కెఫీన్ సగమై పోతుంది.
బా : (నవ్వేడు తెరలు తెరలుగా) కెఫీన్ - సగం -(మళ్ళీ నవ్వేడు) (సగంలో నవ్వాపి) **ఇలా నవ్వి ఎన్నిరోజులైంది?** సరోజ బ్రతికుండగా జీవిత వనంలో అన్నీ నవ్వులే పూచేవి. ప్రతిక్షణం నవ్వుల పువ్వులు ఏరుకుంటూ మేమిద్దరం రోజులు క్షణాలుగా గడిపాం. ఆకలి లేదు. నవ్వడానికి ఆయాసం లేదు. ఆమె నవ్వుల వెన్నెలకు పగలు లేదు. రాత్రి లేదు. ఆమె నవ్వుల వెన్నెలలో - నది ఒడ్డున ఇసుకలో ఆటాడుకునే పసిపిల్లాడిలా నేను. అదే జీవితం అనుకొన్నాను. ఒక రోజు సాయం కాలంవేళ అకస్మాత్తుగా ఆ వెన్నెల మాసిపోయి, నా జీవితం నిండా చీకటి అలముకొంది. కాంతారావుగారూ మనిషికి! అకస్మాత్తుగా చావెందుకు వస్తుంది? చెప్పండి - నా సరోజ అకస్మాత్తుగా చచ్చిపోవడానికి కారణమేమిటి? మీరు చెప్పరు. నా కంతా తెలుసు. మీరు మాయ మనుషులు: నిజం తెలిసీ చెప్పలేని మోసగాళ్ళు. (పళ్ళు నూరేడు) జ్యోతిష్యం మీద నమ్మకం పెంచుకుంటే మనిషి నిర్వీర్యుడై పోతాడు. అతని సమస్త సంపదలూ గడ్డి పరకల మాదిరి ఎగిరి పోతాయి. అయినా ఆ నమ్మకం తప్పదు.
కాం : బాలరాజు గారూ! మీకు విశ్రాంతి చాలా అవసరం. కాస్సేపు నిద్రపోతే --
బా : నాకు విశ్రాంతి చాలా అవసరం. మీతో సంగతులన్నీ చెప్పిగానీ నేను నిద్రపోను.
అవునూ - ఎంత వరకు చెప్పాను? నా జీవితం నుంచి సరోజ వెళ్ళి పోయింది. - విచారంతో క్రుంగి పోయాను. నాకు తోడు నెలల గుడ్డు. వాడితో కాలం గడుపుతూ దుఃఖాన్ని దిగమింగడానికి ప్రయత్నించాను. పసిపాప చిరునవ్వుల్లో వియోగ విషాన్ని అమృతంగా మార్చుకొన్నాను. మా రాజా నాకు మళ్ళీ కొండంత ఆనందాన్ని యివ్వడం ప్రారంభించాడు.
కాం : రాజా అంటే - ?
బా : మా అబ్బాయి - వాడు నన్ను తిరిగి మనిషిని చేశాడు. మళ్ళీ బ్రతకాలన్న ఆశ కలిగించాడు.
తొమ్మిది సంవత్సరాలు నా భార్యను మరచిపోయి కాలం గడిపాను.
కాం : మీ రాజా ఆరోగ్యం బాగుండలేదా?
బా : రాజా ఆరోగ్యం బంగారంలా ఉంది. కాని - జరిగింది చెబుతా వినండి -
నాలో ఒక ప్రశ్న ఉదయించింది.
మనుష్యులు అకస్మాత్తుగా ఎందుకు చచ్చిపోతుంటారు? సరోజకు ఏ అనారోగ్యమూ లేకుండా చచ్చిపోవడానికి కారణం ఏమిటి? వైద్య సదుపాయంలో లోటేం చేయలేదు. మృత్యువు మనిషిని కబలించడానికి ఏదో ఒక ప్రత్యేకమైన కారణం ఉండాలనిపించింది.

కాం : సుఖంగా సాగిపోతున్న కాలానికి మీరు చేజేతులా ఆనకట్ట కట్టుకుంటూన్నారేమో?

బా : అంతేనంటారా?

కాం : మీ కన్నుల పంట రోజా మీ విచారాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నపుడు మీరు చేజేతులా దుఃఖాన్ని కొని తెచ్చు కుంటున్నారేమో!

బా : కావొచ్చు నేమో! నా అనుమాన నివృత్తికి ఒక జ్యోతిష్కుని కలుసుకున్నాను. ఆయన అంశ, రాశి చక్రాలు దీక్షగా పరికించాడు. నా అనుమాన నివృత్తి కావడం అలా ఉంచండి – ఒక గొప్ప భయంకరమైన సత్యం తెలిసింది. నేను చాలా సెన్సిటివ్ ఫెలోని. ఏ చిన్న అఘాయిత్యాన్నీ తట్టుకోలేను. అటువంటిది – నాకు సంబంధించిన భయంకర సత్యం వినేసరికి నాలో విపరీతమైన ప్రకంపన బయలు దేరింది.

కాం : మీరు తాడును చూసి పామనుకుంటున్నారేమో!

బా : లేదు కాంతారావు గారూ! ఇవాల్టికి సరిగా ఎనిమిది రోజుల అవతల ఈ ప్రాణం నిలవదు.

కాం : (ఆశ్చర్యంగా) ఆ జ్యోతిష్కుడెవరో చెప్పగలరా?

బా : ఆయన సరోజ గురించి కూడ చెప్పాడు. అది నిజమైంది. అక్షరపతు నిజమైంది. అందుకే నాకీ నమ్మకం.

కాం : మీరు ఊరికే ఆవేశపడుతున్నారు.

బా : నేను ఆవేశపడుతున్నానా కాంతారావుగారూ? నాకు నిజం తెల్సు కనుక, ఆ నిజం అచ్చంగా నా గురించ కనుక, నాకు సహజంగా ఆవేశం కల్గుతుంది. పోనీ – మీరు కూడా నా జాతక చక్రం చూడండి!

కాం : తెచ్చారా?

బా : నేను వచ్చింది అందుకే ! నాకు నిర్ధారణగా కావాలి. నా చావు ఖాయమని తెలిస్తే, నేనీ బంధాలన్నీ తెంచుకొని ఆ లోకం వెళ్ళిపోవడానికి సిద్ధమౌతాను.

(జాతకం అందిస్తాడు)

కాం : ముందు మీ మనసును నిర్మలం చేసుకోండి! తాపీగా, హాయిగా నవ్వుకోండి. అంతా విపులంగా చెబుతాను.

బా : నా కింకా చాలా కాలం ఆయుష్షు ఉందని అబద్ధం చెబితే నమ్ముతాననుకున్నారేమో! నేను చావడం ఖాయం ! మీరు చెప్పవలసిందల్లా అది నిజంగా నిజమని!

కాం : బాలరాజు గారూ! మిమ్మల్ని చూస్తుంటే భయం వేస్తోంది. మీరు నిర్విచారంగా, నిరాలోచనగా కూచోండి. నేను నిజమే చెబుతాను.

బా : (సాలోచనగా)

నాకు నిజం తెలియకుండా వుంటే నా జీవితం మరోలా ఉండేది. చావన్నది ఎప్పుడో తెలియకుండా మనిషిని మాయ చేయాలి తప్ప, ఫలానా నిమిషంలో చావొస్తుందని తెలిస్తే ఆ చావులో అంతా చావే!

కాం : మీ తండ్రి గారు సహజంగా చనిపోయారా?

బా : ఎండ్రిన్ తాగి పోయారు.

కాం : మీ తాతగారు నూరేళ్ళు బ్రతికారా?

బా : వాళ్ళ బాబు మీద కోపం వచ్చి ముప్పై ఆరేళ్ళు నిండిన రోజు మిట్ట మధ్యాహ్నం పశువుల పాకలో నడిమి దూలానికి నవారుతో ఉరిపోసుకుని చనిపోయారు.

కాం : – – –

బా : మీకింకా వివరంగా చెబుతున్నాను. నలభైఏళ్ళుదాటి బ్రతికిన వాళ్ళు మా వంశంలో లేరు.

కాం : మీ కిప్పుడు ముప్పై రెండు నిండుచున్నాయి.

బా : ముప్పై మూడేళ్ళు వచ్చిన రోజు అర్థరాత్రి పన్నెండు గంటలకు నూరేళ్ళూ నిండిపోతాయి. అవునా?

కాం : – – –

బా : ఏం – మౌనం వహించారేం? నేను చచ్చిపోవడానికి సిద్ధంగా ఉన్నాను. నా కోసం పరితపించే సరోజ లేదు. నాకేం దారి చూపించలేదని ఏడవడానికి నా కొడుకుక్కి అవకాశం లేదు. పదిహేనెకరాల సుక్షేత్రం ఉంది. కానీ ఎటొచ్చీ నేను ఒకందుకు విచారిస్తున్నాను. ఎన్నో అందమైన ఉదయాలు చూశాను. ఎర్రని ఇనబింబం పడమట కుంకే వేళ, అందమైన గాజులు ధరించిన సుందర హస్తాన్ని చేజిక్కించుకొని, ఏకాంతంలో ఆ అందమైన మనస్సుతో పాటు, భవిష్యత్తును కలగంటూ ఎన్నో సాయంత్రాలు గడిపాను. నక్షత్ర కాంతిలో నవల కన్నుల సంతృప్తి రేఖలు చదువుతూ స్వర్గాన్ని సరాసరి యిలాతలం మీదికి దింపుకొని, స్వప్న రేఖలకు నైగనిగ్యాన్ని దిద్దుతూ ఎన్నో రాత్రులు లెక్క చూశాను – కాని –

కాం : చెప్పండి – ఆగిపోయారేం? మీ వాగ్ధోరణిని అడ్డుకొనే సాహసం నాకు లేదు. నాకు తెలిసినంతలో జీవితం గూర్చి ఇంత విపులంగా చెప్పే మిత్రహృదయమేదీ యింతవరకు తారసిల్ల లేదు.

బా : నాకు తొలి నుంచీ కలలు గనడం అలవాటు. కలలే నావూపిరి, ఉన్న కలలన్నీ ఈ వేళ ఉలిపిరి కాగితాలై పోయాయి. సగం సగం జరిగిన స్వప్నాల రాసులను జాగ్రదావస్థలో ఇవాళ చదివితే – ఒకే ఒక్క విచారం పెద్ద నిరాశగా పామై, పులై, జూలు దులిపిన సింహమై నా ముందు నిలబడింది.

కాం : మీరింతకు ముందు కవిత్వం వ్రాసేవారనుకుంటాను.

బా : కలలు గనడం అలవాటయిన వాడికి కవిత్వం దానంతటదే పట్టుబడుతుంది. అయినా – అది గత ప్రాభవం.

కాం : మీ భవిష్యత్తును అందంగా కలగన్నారు. తప్పుగాదు. కాని, అత్యాశ పెంచుకున్నారు. బ్రతుకు వాకిట సుఖాల తోరణాలే వ్రేలాడాలంటే అది సాధ్యమయ్యేది కాదు. వర్తమానంతో సంతృప్తి పడలేక, భవిష్యత్తు కోసం తపించే మీ లాంటి వాళ్ళు మరణాన్ని సులభంగా స్వీకరించలేరు. అయినా, ఒక చిన్న మాట చెబుతాను. జ్యోతిష్యం గతం గురించి చెప్పినంత ఖచ్చితంగా భవిష్యత్తును చెప్పలేదు. ప్రిడిక్షన్ అనేది నూటికి నూరుపాళ్ళు నిజం కాదు.

బా : అయినా అవకాశం అనేది లేకపోలేదు కదా!

కాం : లేదని ఖచ్చితంగా చెప్పగలిగే ధైర్యం కలగడం లేదు. మీరు వర్తమానంలోని నిరాశను భవిష్యత్తుకు అంటగట్టకండి. ఈ నిరాశను ఇంతటితోనే తుడిచేసెయ్యండి.

బా : నా గుండె రాయి కాద కాంతారావుగారూ! నేను సామాన్యుణ్ణి. మాన్యులు చేసే మ హత్కార్యాన్ని సగటు మనిషిని – సాధ్యపరచలేదు.

కాం : మానవ ప్రయత్నం లేకపోతే అతీతమైన శక్తంటూ ఏదీ మనలను ఆదుకోదు. మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకొన్న తరువాత, మీభయాన్ని, ఆత్రుతనూ పోగొట్టాలన్న కోరిక నాలో అంతకంతకు బలపడుతోంది

బా : నా మీద మీకంత అభిమానం ఏర్పడడం సహజమే అయినా – మీ అభిమానాలతో నాకేం పని లేదు. నా మీద జాలి కూడా వద్దు. నేను జీవితంలో మనిషి చేయదగ్గ మంచి పని ఏ ఒక్కటీ చేయలేక పోయాను. అంతా స్వార్థంతోనే చేశాను.

కాం : ఏ మనిషైనా అంతే కదా!

బా : కాదు కాంతారావుగారూ! నా వంటి స్వార్థపరుడు మరెవ్వడూ ఉండడు.

కాం : పోనీండి – మీరు స్వార్థ పరులో కాదో నాకు తెలీదు. కానీ మీరు చావునుంచి తప్పించుకుంటే నేను చాలా సంతోషిస్తాను.

బా : అంటే – అంటే – నాకు చావు తప్పదన్నమాటేగా!

కాం : మీరెందుకింత బెంబేలెత్తిపోతున్నారో నా కర్థం కావడం లేదు–

బా : ఆ నిజాన్ని మీ నోటితో చెప్పండి కాంతారావుగారూ! మరో ఎనిమిది రోజుల తరువాత అర్థరాత్రి వేళ నన్ను మృత్యువు కబళిస్తుంది. ఇది నిజంగా నిజమేనా కాంతారావుగారూ? ఇదొక విధంగా సంతోషం – సరోజను కలుసుకోవచ్చు. ఎక్కడ? స్వర్గంలోనా? నరకంలోనా? ఎడ్రస్ తెలిదే....

కాం : విచారం పెంచుకున్న కొద్దీ పెరుగుతుంది. కన్నీరు పెట్టడం కాంతా లక్షణం. మీ రొక్కసారి ఆలోచించండి. చావు ఏ ప్రాణికైనా, ఎప్పటికైనా తప్పదు. ఈవేళ తెలివిగా తప్పించుకున్నా రేపు మృత్యువు మరింత బలంగా దండయాత్ర చేస్తుంది. జీవితంలో మీరేమీ మంచి పని చేయలేదన్నారు కదా! ఈలోగా ఒక మంచి పని చేయండి.

బా : ఈవేళ మూడవ తారీఖు. పదకొండవ తారీఖులోగా మంచి పని చేయాలి. ఏం చేయను?

కాం : ఉన్న ఆస్తంతా పంచి పెట్టండి.



బా : మరి నా కొడుకు సంగతి?

కాం : వాడు అదృష్టవంతుడైతే మీ కన్నా ఘనంగా సంపాదించుకుంటాడు.

బా : వాడు అదృష్టవంతుడైతే వాడి నాన్న హాయిగా బతికే ఉంటాడు కదా!

కాం : పోనీ మీ చేతులతో ఒక పెళ్ళి జరిపించండి.

బా : ఇది మూఢం. ముహూర్తాలు లేవు. ముహూర్తంతో పని లేనిది చావొక్కటే!

కాం : మీరిన్ని విధాల ఆలోచించి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి. మనం చేయవలసింది చాలా ఉంది.

బా : ఏం చేయను?

కాం : మీరు చావకూడదు. అందుకు మనం ఏమైనా చేద్దాం.

బా : మనిషిని మనిషి బతికించ లేడు – చంపగలడు గాని.

కాం : రేపు మీది బాలరాజాగారూ! రేపటి మీది ఆశతో మీ నిరాశను సమూలంగా నరికి పారేయండి. మీ కోసం సూర్యుడు అందంగా ఉదయిస్తాడు. వెన్నెల మీ కోసం కాస్తుంది. కోకిల మీ కోసం పాడుతుంది. సకల చరాచర జగత్తు మీ కోసమే స్పందిస్తుంది. అలా భయపడతారెందుకండీ! మనం చేయవలసిందేమిటో వివరంగా చెబుతాను రండి – రండి !
అలా బయటికి కెడదాం !!

(ఇద్దరూ నిష్క్రమిస్తూ వుండగా స్టేజి మీది లైట్లు ఆరిపోతాయి)

## రెండవ భాగం

(బాలరాజా ఇంట్లో ఒక గది)

(రాజా పాటపాడతాడు. వేంకటేశ్వరస్వామికి పూజ చేస్తాడు)

బా : రాజా!

రా : ఏం నాన్నగారూ?

బా : నువ్వు స్నానం చేశావా బాబూ?

రా : ఓ – పూజ కూడా అయిపోయింది. ఇదిగో ప్రసాదం తీసుకోండి.

బా : ఏది బాబూ! ఇలా ఇవ్వు – (తీసుకున్నాడు) నీ కన్నీ మీ అమ్మ పోలికలే వచ్చాయి. అవునురా ! అన్నీ మీ అమ్మ పోలికలే! రోజూ పూజ చేసి గానీ మీ అమ్మ మరో పని ముట్టేది కాదు – మీ అమ్మ నీకు గుర్తుందా?

రా : అమ్మ ........ నాకు ఊహ వచ్చాక అమ్మ గురించి మీరు అన్నీ అబద్ధాలే చెప్పారు. అమ్మ దేవుడి దగ్గర కెళ్ళిందన్నారు. ఏదో ఊరు వెళ్ళింది – రేపో మాపో వచ్చేస్తుందని మాయ చేశారు. నాకు తెలుసు నాన్నాగారూ! చచ్చిపోయిన వాళ్ళు తిరిగిరారని.

బా : నీ కెవరు చెప్పారు బాబూ!

రా : ఎవరో చెబితే కానీ నాకు తెలియదనుకున్నారా? నాకు అన్నీ తెలుసు; అమ్మ గురించి మీరు మనస్సులో ఎంతగా మథన పడుతున్నారో నాకు తెలుసు. నాకు తెలుసు నాన్నగారూ. ఏ మనిషి మీదైనా ఎక్కువగా యిష్టాన్ని పెంచుకుంటే చాలా ప్రమాదమని.

బా : నిజం చెబితే నువ్వు ఏడుస్తావని నీకు నిజంగా అన్నీ అబద్ధాలే చెప్పాను.

రా : నేను ఏడవడం ఎందుకు నాన్నగారూ! అమ్మా, నాన్న అన్నీ మీరే నాకు. నేను కళ్ళ చూడని అమ్మను గురించి ఏడవడం కన్న, మీలో అమ్మను చూసుకొని గర్విస్తున్నాన్నేను.

బా : రాజా! నిన్ను చూసి గర్వించే అదృష్టం నాకు లేదయ్యా!

రా : అదేంటి నాన్నగారూ?

బా : ఇవాళ బయలుదేరి వెళ్ళిపోవాలి నేను.

రా : ఏ వూరు వెడుతున్నారు?

బా : నీ పిలుపందని చోటికి. ఆకలీ, దుఃఖమూ తెలీని చోటికి. ఆర్థికమైన యిబ్బందులు లేని చోటికి. అది స్వర్గమో, నరకమో తెలీదు నాకు. అయినా వెళ్ళాలి. వెళ్ళక తప్పదు.

రా : నాన్నగారూ !

బా : రాజా ! నేను వెళ్ళిపోతే నువ్వసలు ఏడవకూడదు.

రా : ఏడవకూడదా? మీరు లేకపోతే నాకేమీ తోచదు. గోపయ్యా, నేను బిక్కు బిక్కు మంటూ ఈ యింట్లో వుండాలి. గోపయ్య అసలే ముసలి వాడు.

బా : నేను మళ్ళీ వచ్చేస్తాను. నువ్వు నాన్నా అని పిలు. నీ పిలుపు వినిపించిన వెంటనే పరుగు పరుగున వచ్చేస్తాను.

రా : రేపట్నించీ మాకు పరీక్షలు. లేకపోతే నేనూ కూడా వచ్చేవాణ్ణి.

బా : నేను తిరిగి వచ్చేస్తాను రాజా! ఇంత వరకూ నేనేం చేశానో, ఏం చేయగలిగానో నాకు తెలీదు. మళ్ళీ వచ్చి చేయగలిగిందేం కనిపించడం లేదు.

రా : అసలు మనిషి చేయవలసిన దేమిటి?

బా : ప్రతి మనిషీ తనను తను ప్రశ్నించుకోవలసిన ప్రశ్నయిది. తాను చేయవలసిందేమిటో తెలిసిన వాడు మనిషి మనిషిగా బతగ్గలడు. కానీ నేను చెప్పినా నీ కర్థం కాదేమో రాజా!

రా : నాకు తెలిసే విధంగా చెప్పండి.

బా : మన వల్ల ఏ ప్రాణీ బాధపడకూడదు. తోటి వాడి చెక్కిలి మీది కన్నీటిని తుడవగల సానుభూతి చక్కని సంస్కారానికి గుర్తు. అపకారం చేసిన వాడిని సైతం క్షమించగల స్వభావం గొప్పతనానికి గీటురాయి. ఏ మనిషైనా చెడు వినకూడదు. చూడకూడదు. చెప్పకూడదు.

రా : నా కేమీ అర్థం కాలేదు

బా : నువ్వు పెద్దవాడివైతే గానీ అర్థం కాదు బాబూ!

రా : మన వల్ల ఏ ప్రాణీ బాధ పడకూడదు. అంటే మనం తెలిసి ఎవరికీ అపకారం చేయ కూడదు. తరువాత -

బా : ఎదుటి ప్రాణి బాధను అర్థం చేసికొని, సానుభూతి చూపించగలగాలి.

రా : బాధపడే వాళ్ళని చూసి వాళ్ళ ఖర్మ అని చెప్పి మనం వెళ్ళిపోకూడదు. చాతనైనంత సాయం చేయాలి.

బా : మనిషికి ఉపకారం చేయడం కాదు గొప్పతనం. మనకు అపకారం చేసిన వాడిని మనం క్షమించగలగాలి.

రా: ఇది మాత్రం నాకు నచ్చలేదు నాన్నగారూ!

బా : ఏం బాబూ ! ఎందుకని ?

రా : ఎవరో మనకి అపకారం చేసేరు. మనం మాట్లాడక ఊరుకోవాలా? అప్పుడు వాడు మళ్ళీ మనల్ని మోసం చేస్తాడు. నోర్మూసుకు కూచుంటామా?

బా : మామూలు మనుష్యుల స్వభావమంతే !మన కపకారం చేసిన వాడి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటాము



లేకపోతే చాతకాని తనం కింద తేలిక చేస్తారని భయపడతాం. కాని – క్షమించగల ఓర్పు గొప్ప వాళ్ళకు మాత్రమే అలవడుతుంది.

(గోపయ్య కూరగాయల సంచితో వచ్చాడు)

రా : ఇంత ఆలస్యమైందేం గోపయ్యా?

గో : ఏం సెప్పను బాబయ్యా!
నా కియ్యాల మతి లేదు.

రా : ఏ వూరెళ్ళింది గోపయ్యా?

గో : సంతకెళ్ళింది బాబయ్యా!

రా : ఏం తెచ్చింది గోపయ్యా?

గో : అదేంటి బాబయ్యా? మతి ఏం తెస్తాది?

రా : (పాట అందు కుంటాడు)
ఏనుగమ్మా ఏనుగు –
ఏ వూరెళ్ళిందేనుగు –
ఏలూరెళ్ళిందేనుగు –
ఏం తెచ్చిం దేనుగు –
(రాజా పాడుకుంటూ బయటికి వెళ్ళేడు)

బా : గోపయ్యా!

గో : బాబయ్యా!

బా : నువ్వు చాలా కాలం నించీ మా యింట్లో పని చేస్తున్నావు కదూ!

గో : అవును బాబయ్యా!

బా : నీకేం కావాలో కోరుకో

గో : దేనికి బాబయ్యా?

బా : ఇన్నాళ్ళు నన్నూ, రాజానీ కంటికి రెప్పలా కాపాడు కొచ్చావు. నీవేది కోరితే అది యిస్తాను – కోరుకో?

గో : కోరుకొమ్మంటారా బాబయ్యా?

బా : సందేహం వద్దు. సంకోచం వద్దు. కోరుకోవయ్యా!

గో : నిజంగా నా కోరిక తీరుస్తారా బాబయ్యా?

బా : నీకా అనుమానం వద్దు. చెప్పాగా – నీవేది కోరితే అదియిస్తాను.

గో : అయితే అడిగేస్తున్నాను.

బా : ఊం

గో : వద్దు బాబయ్యా ! నాకే కోరికా లేదు.

బా : గోపయ్యా!

గో : బాబయ్యా!

బా : నీ వేది కోరితే అది యిస్తానంటున్నానుగా – కోరుకో!

గో : వద్దు బాబయ్యా! నాకే కోరికా లేదు.

బా : నాక్కోపం తెప్పిస్తున్నావు.

గో : లేదు బాబయ్యా! మీ క్కోపం వత్తే నేను భరించలేను.

బా : అందుకే కోరుకో!

గో : నా కియ్యాల మతి స్థిమితంగా నేదు బాబయ్యా!

బా : ఏం? ఎందుకని?

గో : మిమ్మల్ని సూత్తుంటే కడుపు తరుక్కుపోతంది. ఊరికే బెంగెట్టుకున్నారు. ఇంత సిన్నవయసులో మీకీ బెంగ మంచిది కాదు.

బా : నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

గో : ఏం సెప్పను బాబయ్యా,

బా : సందేహం వద్దన్నాగా. నీ మనసులో మాట బయటికి చెప్పు. ఇన్నాళ్ళూ మమ్మల్ని నమ్ముకు బతికావు నువ్వు. నా జీవితంలో రేపనేది లేదు.



గో : (ఆదుర్దాగా) బాబయ్యా!

బా : నిజమే గోపయ్యా! నా జీవితంలో రేపటిరోజు లేనేలేదు. ఇవేళ ఏవైనా ఒక మంచి పని చేయాలి. అందుకే కోరుకో! పదెకరాల భూమి నీ పేర రాసివ్వనా?

గో : వద్దు బాబయ్యా – వద్దు! అటువంటి ఊసులతో నా పేనాలు తీయకండి. మీ కాళ్ళట్టుకు బతిమాలుకుంటాను – మళ్ళీ ఆ ఊసెత్తకండి.

బా : గోపయ్యా! గోపయ్యా! ఇవాల్టితో నా జీవితం అంతమై పోతోందన్న బెంగ నాకే మాత్రం లేదు. నీ కెందుకయ్యా నా గురించి బెంగ.

గో : అయితే బాబయ్యా! రాజా బాబుని నాకిచ్చెయ్యండి. నా కంటికి రెప్పలా సూసుకుంటాను.

బా : గోపయ్యా! నాకున్న యావదాస్తీ రాజాతో సహా నీ కప్పగిస్తున్నాను. రాజాని పెంచి పెద్దజేసి, వాడిని ఒక మనిషిగా తయారుచెయ్.

గో : అలాగే బాబయ్యా

బా : రాజా గొప్పవాడు కావాలి. అందరూ రాజా పేరు చెప్పుకోవాలి. బీద బిక్కీ రాజా నీడన హాయిగా బ్రతకాలి. సాటి వారందరికన్న రాజా కీర్తి ప్రతిష్ఠలతో హాయిగా జీవించాలి. ఎలా చూసుకుంటావో ఏమో!

గో : మీరే సూత్తారుగా బాబయ్యా!

బా : (నవ్వేడు) నాకు చూసే అదృష్టం లేదయ్యా గోపయ్యా!

(రాజా ప్రవేశిస్తాడు)

రా : నాన్న గారూ! మీ కోసం ఎవరో వచ్చారు.

బా : ఎవరు బాబూ ?

రా : కాంతారావు గారు –

బా : కాంతారావు గారా ! ఏరీ –

(కాంతారావు ప్రవేశిస్తాడు)

బా : – రండి ! కాంతారావు గారూ! రండి మీకోసమే చూస్తున్నాను. ఇలా కూచోండి! గోపయ్యా! కాంతారావుగారు వచ్చారు. ఫస్ట్‌క్లాస్ కాఫీ తయారు చెయ్! గోపయ్యా వారివాళ మనింట్లోనే వుంటారు. రెండుపూటలా భోజనం ఎలా తయారుచేస్తావో ఏమో! గోపయ్యా – సరిగా విన్నావా? హాయిగా స్నానం చేస్తే బావుంటుందండి ! వేణ్ణీళ్ళు పెట్టు గోపయ్యా ! స్నానానికి ముందు కాఫీ తాగితే – ముందు కాఫీ సంగతి చూడు –

గో : అలాగే బాబయ్యా!

(గోపయ్య లోపలికి వెడతాడు)

కాం : నేను చెప్పినట్టల్లా చేశారా బాలరాజా గారూ?

బా : రాజా! ఇలారా బాబూ ! వీడేనండి కాంతారావు గారూ ! మా ఏకైక వంశాంకురం.

రా : నమస్కారమండీ!

కాం : నమస్కారం బాబూ ! కుర్రాడు చాకులా వున్నాడు. మీకు దిగులెందు కండీ?

రా : మా నాన్నగారు ఏదో బెంగతో ఉన్నారు. మీరైనా చెప్పండి. విచారంతో ఏం సాధించలేమని –

కాం : అవును బాబూ! చిన్నవాడివైనా పెద్ద సత్యం చెప్పావు. విచారంతో మనం ఏమీ సాధించలేము. బాలరాజుగారూ! ఏర్పాట్ల సంగతి ఏం చేశారు?

బా : రాజా ! కాఫీ అయిందేమో చూడు.

రా : అలాగే – (రాజా లోపలికి వెడతాడు)

బా : నేనొక ప్రత్యేకమైన గదిలో పడుకోవాలి. గాలికూడా చొరని ఆ గదిలో మంచి నీళ్ళ కూజా, కర్ర, పిస్టల్ మాత్రం వుండాలి.

కాం : పన్నెండు గంటలకు ముందే మీరు నిద్రపోవాలి. మృత్యువు రాగల అవకాశాలేమీ మీకు అందుబాటులో వుండకూడదు.

బా : కాంతారావుగారూ! ఇప్పుడైనా మీరు నిజం చెప్పగలరా?

కాం : ఏ విషయం గూర్చి?

బా : మనిషి జీవితం ఏ ఘడియలో సమాప్తమౌతుందో జ్యోతిశ్శాస్త్రం చెప్పగలుగుతోంది. ఆ విషఘడియ రాకుండా మనిషి అడ్డుకోగలడా?

కాం : ఇంతకూ మీరు పడుకోవడానికి ఏర్పాటు చేసుకున్న గది యిదేనా?

బా : యిదే –

కాం : గది చుట్టూ మేం కాపలా వుంటాము. ఆ సమయం దాటగానే మీరు మాకు చిరునవ్వుతో దర్శనం యివ్వాలి.

(రాజా ప్రవేశిస్తాడు)

రా : కాఫీ రెడీ సార్! ముందు హాయిగా స్నానం చేయండి

కాం : అయితే పద రాజా!

(ఇద్దరూ వెళతారు)

(Lights off... Lights on)

రా : నాన్నగారూ! అపకారికి ఉపకారం చేయడం గొప్పతనమే. ఉపకారం పొందిన అపకారి మళ్ళీ అపకారం చేస్తే –

బా : లేదు రాజా ! అప్పటికే అతను పశ్చాత్తాపంతో కుమిలి పోతాడు. మళ్ళీ అపకారం చేయగల సాహసం అతనికి కలగదు.

రా : నాకు మాత్రం నమ్మకం కలగడం లేదు.

కాం : అప్పుడే పడుకొన్నారండి. మీ రింక వెళ్ళి పడుకోండి.

బా : అప్పుడే నిద్ర పొమ్మంటారా?

రా : నిద్ర రావడం లేదు నాన్నగారూ?

బా : ఎలా వస్తుంది బాబూ నిద్ర?

కాం : మీకెన్ని విధాల చెప్పినా మీ గుండెల్లో గూడు కట్టుకున్న భయం మాత్రం మిమ్మల్ని విడిచి పోవడం లేదు. లేవండి!

బా : రాజా!

రా : నాన్నగారూ !

బా : మళ్ళీ నిన్ను చూస్తానో లేదో రాజా !

రా : నాన్నగారూ!

బా : మళ్ళీ నీ మాటలు వినగలనో లేదో !?

రా : నాన్నగారూ!

బా : రాజా ! మీ అమ్మ పోయాక నీలో మీ అమ్మను చూసుకొని నవ్వుతూ బతికానురా ! నువ్వు పెద్దదిగితే నాకే దిగులూ లేక పోను. నీ కింక గోపయ్యే దిక్కు.

గో : బాబయ్యా! మీరలా అనకండి బాబయ్యా! దేవుడు మేలు చేస్తే రేపటికి మీరు హాయిగా నవ్వుతూ కనిపిస్తారు.

బా : నమ్మకం చాలని మాటలు పదే పదే అనుకుని ప్రయోజన మేముంది గోపయ్యా! నాకు నిజం తెలుసు. నిజం తెలిసి కూడా నేను నా జీవితాన్ని సరిగా గడపలేక పోయాను. బ్రతికి నన్నాళ్ళూ చచ్చిపోతానేమోనన్న భయంతో – దిగులుతో – క్షణక్షణం – ఛస్తూ బ్రతికాను. అందుకే సిగ్గు పడుతున్నాను.

కాం : మీరింక యివన్నీ మరచిపోయి హాయిగా నిద్రపోండి. పదండి !

బా : వెళతాను కాంతారావు గారూ !మనసులోని దంతా వెళ్ళగక్కనివ్వండి. ఏమనిషైనా జీవిత రహస్యాలు తెలుసుకోవడానికి ప్రయత్నించకపోవడం మంచిది. జీవితం ఎప్పుడు సమాప్త మవుతుందో తెలియకుండా నవ్వుతూ, పేలుతూ బతికిన వాడి బ్రతుకు గొప్పది. నేను భయంతో – గుండెలు చేత్తో పట్టుకొని –ఏడుస్తూ, సగం చచ్చిపోయి, భారంగా – అడుగులు ఈడుస్తూ బతికాను.

బ్రతుకు పొడుగునా అందంగా ఆనంద వృక్షాలు పెంచుకోవలసింది - దుఃఖపు తుమ్మ ముళ్ళ కంచె పాతుకుని నందనారణ్యాన్ని అచ్చం బీడుగా మార్చుకొని, అసలెందుకు బతుకుతున్నానో అర్థమే తెలీక, అబద్ధపు మాయ తెరలో బతికాను. ఏ మనిషికీ యింత శిక్ష వద్దు. ఇంత విచారం వద్దు. ఈ నరకయాతన వద్దు. మళ్ళీ జన్మ అంటూ వుంటే, తిరిగి మనిషిగానే పుడితే, మాయ తెర నన్నుపూర్తిగా కమ్మేయకుంటే, నేను – నా కోసం కాక – నా విచారంలో కాక - అందరి కోసం, అందరి విచారాన్ని పంచుకొని, క్షణ క్షణం – నవ నవంగా బ్రతుకు సుందరిని అలంకరించుకొని జీవిస్తాను. ఈ జీవితాని కింతే అనుకుంటాను.

కాం : మీ అదృష్ట రేఖ అంత మాత్రమే అనుకోండి - రండి

బా : రాజా !

రా : నాన్నగారూ!

బా : నేను మృత్యుదేవత గుహలోకి వెళుతున్నాను.

రా : (ఏడుస్తూ) అలా అనకండి నాన్నగారూ! అలా అనకండి నన్ను విడిచి పెట్టి వెళ్ళకండి -- వెళ్ళకండి నాన్నగారూ నాన్నగారూ!

బా : రాజా! నేను నిన్ను విడిచి పెట్టి వెళ్ళాలనుకోవడం లేదయ్యా విధి నన్ను లాక్కెళుతోంది.

కాం : రా బాబూ ! నాన్న గారిని వెళ్ళనియ్యి.

బా : గోపయ్యా! రాజా జాగ్రత్త.

గో : అలాగే బాబయ్యా!

కాం : మీరు తలుపులు లోపల గడియ వేసుకోండి. మరే ఆలోచనా లేకుండా హాయిగా నిద్రపోండి.-

రా : నాన్నగారూ! టా టా --

బా : టా టా రాజా! టా టా --

(బాలరాజు వెళ్ళాడు)




రా : గోపయ్యా!

గో : బాబయ్యా!

రా : గోపయ్యా!

గో : బాబూ !

రా : నాన్నగారు మళ్ళీ మామూలుగా కనిపిస్తారంటావా?

గో : ఆ అనుమానం వద్దు రాజా బాబూ !

రా : ఇలా మనుష్యులు అకస్మాత్తుగా ఎందుకు చచ్చిపోతారు గోపయ్యా?

గో : తెలీదు బాబయ్యా!

రా : నాన్నగారికి అమ్మంటే ఎంతో యిష్టం. అమ్మ చచ్చిపోయింది. నాన్నగారంటే నాకెంతో యిష్టం. మరి నాన్నగారూ?

గో : వద్దు రాజా బాబూ ! అటువంటి మాటలు మాట్లాడ కూడదు.

రా : మరేం చేయను - మూతి బిగించుకూర్చోనా ?

గో : కథ చెప్పనా బాబూ!

రా : కాకమ్మ కథలు చెప్పి మోసగించడానికి నేను పసిపిల్లాణ్ణి కాదు.

కాం : రాజా ! నువ్వు చాలా బుద్ధిమంతుడివి. ఎంతో తెలివైన

వాడివి. మీ నాన్నగారు మళ్ళీ మనకు నవ్వుతూ కనిపించాలంటే దేవుణ్ణి ప్రార్థించుకో! నాన్నగారికి వెయ్యేళ్ళు ఆయుష్షు కావాలని ప్రార్థన చెయ్యి.

రా : నిజమేనండి. నేనీ మూలగా కూచొని దేవుణ్ణి ప్రార్థిస్తాను.

కాం : చావంటే ప్రతి మనిషికీ ఎంత భయం గోపయ్యా?

గో : అవును బాబయ్యా!

కాం : నువ్వొకసారి గది చుట్టూ తిరిగిరా !

గో : అలాగే బాబయ్యా!

కాం : ప్రతి మనిషీ కలకాలం బతకాలను కొంటాడు. సుఖాన్నీ, దుఃఖాన్నీ పెద్ద మోతాదులో భరించ లేడు. బాలరాజు తన ముప్పై రెండేళ్ళ జీవితంలో ఏమీ సాధించలేక పోయాడు. అయినా యింకా బతకాలని ఆశపడుతున్నాడు. బతికి సాధించగలిగేదేముంది? నేటి వర్తమాన స్థితిగతులను బట్టి చచ్చిపోవడమే మంచిదేమో! మనిషిని మనిషి చూసి ఓర్వలేడు. అడుగడుగునా ద్వేషం – ప్రతీకారం – స్వార్థం. నిష్కల్మషంగా, నవ్వుతూ బతికే వాడెవడూ కనిపించడం లేదు. నిజంగా ఈనాడు మనుషులంతా మనుషులుగా బతకలేక పోతున్నారు.

(గోపయ్య వచ్చాడు)

గో : బాబయ్యా : టీ తాగుతారా?

కాం : నీకు నిద్రొస్తుందా ?

గో : అవును బాబయ్యా!

కాం : అయితే కాస్త టీ తాగితేనే మంచిది!

గో : అరనిముషంలో తెత్తాను బాబయ్యా!

(గోపయ్య లోపలికి వెడతాడు)

కాం : నేనే బాలరాజు స్థానంలో వుంటే యింత ధైర్యంగా ఉండగలనా? ఏ విధంగా చావు ముంచుకు వస్తుందో తెలీదు. ఎంత తెలివైన మనిషీ తప్పని సరిగా చావుకు తలవంచవలసి వస్తోంది. గొప్ప డాక్టర్లు సైతం చావు ముంచుకొస్తే పెదవి విరుస్తున్నారు. అరే – పది నిముషాలు తక్కువ పన్నెండు! ఇంక పది నిముషాలు ! ఇంక పది నిమిషాలు!!

ఏమిటిది? (భయంగా)

ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి – ఎక్కడలేని భయం నన్నావహిస్తోంది. గుండెల్లో గుబులు బయలు దేరింది. చెవుల్లో హోరు. ప్రపంచమంతా గిర్రున తిరుగుతోంది. ఏదో తెలీని మైకం నన్ను కమ్ముకుంటోంది. దూరంగా – దూరంగా దున్నపోతు కనిపిస్తుంది. దున్నపోతు మెడలోని గంటల చప్పుడు వినిపిస్తోంది. అదుగో యముడు! కాలపాశంతో వస్తున్నాడు – నేను బాలరాజు ననుకుంటే ఈ బాధ భరించలేకుండా వున్నాను. నా వల్లకాదు. నా గుండె ఆగిపోయేట్టుగా వుంది.

(కుర్చీలో తలపట్టుకుని కూలబడి పోతాడు)

(లైట్లు ఆఫ్ అయిపోతాయి)

(గోపయ్య వచ్చాడు. రాజా తలుపు తట్టాడు)

రా : నాన్నగారూ ! నాన్నగారూ!!

(తలుపు తీసుకుని బాలరాజు బయటికి వచ్చేడు)

(లైట్లు వెలుగుతాయి)

బా : బాబూ ! రాజా! నిన్ను మళ్ళీ చూస్తాననుకోలేదురా! నేనెంత అదృష్టవంతుడినిరా ! లోకం నాకోసం మళ్ళీ ఆనందంగా నిలబడింది. గోపయ్యా! ఎవరో చెప్పిన మాటలు విని జీవితం నరకం చేసుకున్నాను. నా కింక ఏ దిగులూ లేదు. ఏరీ! కాంతారావు గారేరీ? –
అరె – ఏమిటీయన – కుర్చీలో నిద్రపోతున్నాడు.
(కుర్చీ దగ్గరకు నడచి, ఆయనను తట్టాడు. కుర్చీలోని కాంతారావు తల పక్కకి వాలిపోయింది అచేతనంగా)

బా : కాంతారావు గారూ!.... (సుమారు అరిచినట్టున్నాడు)

రా : అరె –

గో : అదేంటి బాబయ్యా!

బా : మృత్యువు ఎంత భయంకరమైనదయ్యా! భయం కాంతారావు గారిని మింగేసింది. చావుతో నేను యుద్ధం చేస్తున్నానని ఊహించుకొని, భరించ లేక ఈయన చచ్చిపోయాడు. చావు కన్న భయం గొప్పదని నిర్ధారణ అయింది.
నిజమే! చావు కన్న భయం భయంకరమైనది.

(నేపథ్య గానం)

భయం భయం బ్రతుకు భయం
భయమన్నది మనిషికి బరువైన గుదిబండ
ప్రతినిముషం వెంటాడే మెడలోని విరి దండ ||

మనసన్నది పిరికిది ధృతిలేక అది కోతి
బెదురుతుంది నీడకు మూఢ నమ్మకాలకు ||
భయం భయం బ్రతుకు భయం



## అంకితం

నాటకసమాజాల సౌలభ్యం కోసం స్త్రీ పాత్రలేని నాటికలను ముమ్మరంగా రచించి, దాన్నో ఉద్యమంగా నడిపి సత్ఫలితాలు సాధించిన 'రంగ రచనా ప్రవీణ', డా॥ కొరపాటి గంగాధర రావు గారి దివ్య స్మృతికి.

–రచయితలు